క్లుప్తంగా

ఎండీయూ వ్యవస్థను కొనసాగించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైఖ్య ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ వినతి



తెనాలి: రాష్ట్రవ్యాప్తంగా రేషను బియ్యం పంపిణీ వ్యవస్థలో పనిచేస్తున్న ఎండీయూ ఆపరేటర్లను కొనసాగించాలనీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైఖ్య ఎండీయూ ఆపరేటర్లయూనియన్ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఆ ప్రకారం రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను శనివారం తెనాలిలో కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం 9,260 మందిని ఎండీయూ ఆపరేటర్లుగా, 9,260 మంది హెల్పర్లను నియమించి గత మూడేళ్ల అయిదు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ రేషను పంపిణీ చేయిస్తున్నట్టు తెలిపారు. డిగ్రీ, పీజీ, బీటెక్ చదివిన నిరుద్యోగులు ఎందరో ఈ వ్యవస్థలో ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ప్రస్తుతం నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఎండీయూ వ్యవస్థను రద్దుచేస్తే, 9,260 ఎండీయూ ఆపరేటర్లు, మరో 9,260 మంది హెల్పర్ల కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. తమకు పార్టీ ముద్ర వేయటం సమంజసం కాదనీ, వ్యవస్థలో లోపాలుంటే వాటిని సరిదిద్ది, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులు, పేదల పక్షాన నిలబడి న్యాయం చేయాలని కోరారు.

పేదలకు చీరలు పంపిణీ



తెనాలి అర్బన్: సోషల్ యాక్షన్ అండ్ రూరల్ డెవలెప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఐతానగర్‌లో శనివారం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. విద్యార్థులకు జామెట్రీ బాక్స్‌లు, పెన్నులు, పెన్సిల్స్, పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు అందె శ్యామ్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎం.ఎస్. డేవిడ్ రాజు, పి.సృజన్ రాజు, వి.శేషు, జె.రమేష్, మహర్షి పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు సక్రమంగా చేయండి

తెనాలి అర్బన్: వ్యాధి నిర్ధారణ పరీక్షలను సక్రమంగా చేయాలని తెనాలి పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు ఆరోగ్య కేంద్రాల్లోని ల్యాబ్‌లను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ల్యాబ్ టెక్నీషియన్లు సుధీర్‌కుమార్, కమలాకర్, గుప్తా, శ్రీ విద్య, ధనలక్ష్మి, శివకృష్ణ ఉన్నారు.

తెగిన నిడమర్రు చెరువు

మంగళగిరి: నగర పరిధిలోని నిడమర్రు చెరువు తెగడం స్థానికులను ఆందోళనకు గురిచేసింది. శనివారం కురిసిన భారీ వర్షానికి చెరువు తెగడంతో వర్షపు నీరు టిడ్కో నివాసాలతో పాటు ఎస్సీ కాలనీలోని ఇళ్లల్లోకి భారీగా చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇళ్లల్లోని నీటిని బయటకు పంపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చెరువు తెగి ఇళ్లల్లోకి నీరు చేరిందని స్థానికులు తెలిపారు.

వర్షానికి రోడ్డుపై పడిన చెట్టు

మంగళగిరి: పట్టణంలోని నిడమర్రు రోడ్డులో శనివారం కురిసిన వర్షం, ఈదురు గాలులకు చెట్టు విరిగిపడింది. నిడమర్రు రోడ్డు రైల్వేగేటు దగ్గరలో పడిన చెట్టుతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలి



తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలు అంటువ్యాధులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంటీఎంసీ పరిధిలోని అంబేడ్కర్ కాలనీ (డ్రైవర్స్ కాలనీ) అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు మానస అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా కలుషితమైన నీరు, కలుషిత ఆహారం తీసుకోవడం వలన డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, బయట ఆహారానికి దూరంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండడం వలన దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, ప్రజలు పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వారం రోజుల్లో డెలివరీ అయ్యే గర్భిణులు, హైరిస్క్ గర్భిణులు ముందస్తుగా హాస్పిటల్ చేరాలన్నారు.



ప్రధాన పోస్టాఫీసులో పోస్టుమాస్టరు రూంలోకి చేరిన నీరు



వన్‌టౌన్ పోలీస్‌స్టేషను ఆవరణలోకి చేరిన వర్షం నీరు



వర్షం నీటిలో మునిగిన కొత్తపేటలో ప్రభుత్వ కార్యాలయాల రోడ్డు



తెనాలి శివారు రాజీవ్ గృహకల్పను చుట్టుముట్టిన వర్షపునీరు

ఆంధ్రా ప్యారిస్‌లో కుంభవృష్టి

- పంట కాల్వలను తలపించిన రహదారులు
- ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- డ్రెయినేజీలో పడిన సచివాలయ ఉద్యోగిని
- మొరాయించిన ద్విచక్రవాహనాలు
- పలు హోటళ్లు, దుకాణాలు సైతం మూత



పంటకాల్వలా మారిన తెనాలి పట్టణంలోని బోసురోడ్డు

తెనాలి: 'మార్కెట్‌కు వెళ్లాలి...ఎవరైనా రూట్ మ్యాప్ చెప్పి పుణ్యం కట్టుకోండి...మునిగిపోని రోడ్డు అయితేనే...' అంటూ సోషల్ మీడియాలో తెనాలివాసి పెట్టిన పోస్టు శనివారం నాటి పట్టణ పరిస్థితికి అద్దం పడుతుంది. కుండపోత వర్షానికి ఆంధ్రాప్యారిస్ తెనాలి గుండె చెరువైంది. పట్టణంలోని రహదారులు పంటకాల్వలను తలపించాయి. ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ద్విచక్ర వాహనాలు నీటిలో ప్రయాణంతో మొరాయించాయి. చిరువ్యాపారులు సెలవు ప్రకటించారు. పలు హోటళ్లు, దుకాణాలు సైతం మూతపడ్డాయి. పాఠశాలలకు ప్రభుత్వమే సెలవు ఇచ్చిన విషయం తెలిసిందే. మొత్తంమీద జనజీవనం అస్తవ్యస్తమైంది. తెనాలిలో శనివారం 16.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇటీవలకాలంలో ఈ స్థాయిలో వర్షం కురిసింది లేదు. ఉదయం నుంచి కొనసాగుతున్న వర్షానికి పట్టణంలోని రోడ్లు పంట కాల్వలుగా మారిపోయాయి. మోకాలి లోతు నీరు ప్రవహించింది. సాయంత్రం వరకు నీరు తగ్గలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పట్టణంలోని కొత్తపేట, నాజరుపేట, మారీసుపేట, గంగానమ్మపేటతో సహా ఇతర లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. రాకపోకలు అసాధ్యంగా మారాయి. ద్విచక్ర వాహనాల సైలెన్సర్లలోకి నీరు వెళ్లి, మధ్యలోనే ఆగిపోవటంతో పలువురు తోసుకెళ్లాల్సి వచ్చింది. ముఖ్యంగా ప్రధాన రహదారులైన బుర్రిపాలెంరోడ్డు, బోసురోడ్డు, ప్రధాన పోస్టాఫీసు రోడ్డు, నాజరుపేటలోని చెరువు వారి వీధి, అనుబంధ వీధులు నిజంగా పంటకాల్వలనే తలపించాయి. వర్షంలోనూ పింఛన్ల పంపిణీ చేస్తున్న క్రమంలో 10వ సచివాలయం లక్ష్మీనగర్‌కు చెందిన వెల్ఫేర్ అసిస్టెంట్ జలమయమైన బుర్రిపాలెంరోడ్డులో తెలీక డ్రెయినేజి కాల్వలో పడిపోయారు. చివరి నిముషంలో ఎవరో గమనించి, ఆమెను బయటకు లాగారు. ఆర్ఆర్ నగర్‌లోని మూడు సంక్షేమ హాస్టళ్లలో గురుకుల గిరిజన బాలికల హాస్టలులోకి వర్షపునీరు ప్రవాహంలాగా ప్రవేశించింది. వారిని సమీప చంద్రబాబునాయుడు కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు చేర్చారు. పక్కనే ఉన్న ఎస్టీ, ఎస్టీ హాస్టళ్ల విద్యార్థులను మారీసుపేట చెంచు రామానాయుడు మున్సిపల్ హైస్కూలుకు తరలించారు. ప్రధాన పోస్టాఫీసులోకి వర్షపునీరు చేరింది. వర్షపునీటిలోనే ఉద్యోగులు పని చేయాల్సి వచ్చింది. చంద్రబాబు నాయుడు కాలనీలోని రాజీవ్ గృహకల్పను వర్షపు నీరు చుట్టుముట్టింది. కొత్తపేటలోని ఫైర్‌ఆఫీస్, తహసీల్దారు ఆఫీస్, వన్‌టౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్లు ఉన్న రహదారిలో మోకాలిలోతు నీరు చేరి, రాకపోకలను బంద్ చేసింది.

రూరల్ మండలంలో....

రూరల్ మండలంలోని గ్రామాల్లోనూ పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. వర్షాలకు కొలకలూరులని వల్లూరి వారి చెరువు పొంగింది. ఫలితంగా సమీపంలోని రహదారులు జలమయమయ్యాయి. మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ గ్రామాన్ని సందర్శించారు. కోపల్లెలో జలమయమైన ఇళ్లలోని అయిదు కుటుంబాలను దగ్గర్లోని పాఠశాలకు తరలించారు. బుర్రిపాలెం గ్రామంలో 15 కుటుంబాలకు వర్షపు నీటి తాకిడి ఏర్పడింది. సహాయక శిబిరంలోకి తరలించాలని చూసినా, సమీప రైతుల ఇళ్లలో తలదాచుకుంటామని చెప్పారని తహసీల్దార్ చెప్పారు. మండలంలో వర్షం కారణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా, తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు ఫోన్ చేయొచ్చని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ వెల్లడించారు.

నీట మునిగిన ప్రభుత్వ వసతి గృహాలు

తెనాలి రూరల్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో తెనాలి మారిస్‌పేట ఆర్ఆర్ నగర్‌లోని సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ వసతి గృహాలు నీట మునిగాయి. నాలుగడుగుల మేర నీరు నిలచిపోవడంతో విద్యార్థినులను ఇతర ప్రాంతాలకు తరలించారు. కాలనీలోని ఐదో లైనులో ఉండే ఈ వసతి గృహాల సముదాయం పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో ఒకటి. ఇక్కడ రెండు ఎస్సీ బాలికల వసతి గృహాలు, గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ స్కూలు ఉంది. భవనాలు పాత బడినా ఇన్నాళ్లు ఇక్కడే వీటిని నిర్వహిస్తున్నారు. శుక్రవారం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఆర్ఆర్ నగర్‌లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఈ వసతి గృహాల సముదాయం పల్లపు ప్రాంతంలో ఉండడంతో నీటితో నిండిపోయింది. రెసిడెన్షియల్ స్కూలులో ప్రిన్సిపల్ గది, స్టాఫ్ రూంలలోని ఫైళ్లు నీట మునిగాయి. ఉదయం నుంచి ప్రిన్సిపల్ విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, వార్డెన్ పరిస్థితిని సమీక్షిస్తూ రాత్రి వరకు అక్కడే ఉన్నారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించినా కనీసం మున్సిపల్ అధికారులు అటుకేసి చూసిన పాపాన పోలేదు. ఎంతవో జయంతిబాబు వసతి గృహాలను సందర్శించి విద్యార్థులకు ప్రత్యామ్నాయ శిబిరాలను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతిచ్చారు. గిరిజన రెసిడెన్షియల్ స్కూలు విద్యార్థులను చంద్రబాబు నాయుడు కాలనీలోని మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలోని పై అంతస్తులో, ఎస్సీ బాలికల వసతి గృహాల విద్యార్థినులను మారిస్‌పేట ఎన్‌సీఆర్ మున్సిపల్ హైస్కూలులో ఉండేలా ఏర్పాట్లను ఆయా వార్డెన్లతో చేయించారు. రాత్రి వరకు వీరంతా వర్షపు నీటిలోనే ఉండిపోవాల్సి వచ్చింది. వర్షాలకు అప్రమత్తంగా ఉన్నామని, ప్రజలకు ఇబ్బందులు లేకుండ అన్ని చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ అధికారులు ప్రకటనలు చేసినా వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఆర్ఆర్ నగర్ నివాసితులు, వసతి గృహాల విద్యార్థుల కష్టాలు వీరికి కనబడకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చెరువులను తలపిస్తున్న వరి పొలాలు

కొల్లిపర: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో శుక్రవారం రాత్రి నుంచి ఈదురుగాలులతో ఏరతెరపి లేకుండా జోరున వర్షం కురుస్తుండటంతో కొల్లిపర మండలంలోని రైతులు ఉలిక్కిపడ్డారు. నిన్నటి వరకు వర్షం లేక పోవడంతో మోటార్లు, ఆయిల్ ఇంజన్లు , కాలువలు ద్వారా వరి, పసుపు, అరటి ,కూరగాయలు పంటలకు నీరు అందించారు. అల్పపీడనం కారణంగా వర్షం కురవడంతో కొంత సంతోషంగా ఉన్నా ఇదే విధంగా నాలుగు రోజులు పడితే పంటలకు నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో తెనాలి, కొల్లిపర మండలాల్లో 90 వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్‌లో వరి సాగు చేస్తున్నారు. ఈ వర్షానికి పల్లపు ప్రాంతాల్లోని వరి నాట్లు పూర్తిగా నీట మునిగినాయి. కొన్ని చోట్ల వరి పైరు కొనముక్కులు వరకు నీరు కనిపిస్తోంది. ఇదే విధంగా వర్షం వారం రోజులు పడితే పంట పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జోరున వర్షంతో పంట పొలాలతో పాటు కొల్లిపర, వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, దంతలూరు, అత్తోట, దావులూరు. తూములూరు, చివలూరు. జెముడుబాడు తదితర గ్రామాల్లో వర్షం నీరు నిలిచింది.

తెనాలి పురపాలక సంఘంలో కాల్ సెంటర్

తెనాలి అర్బన్: పట్టణంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల వల్ల సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే తమకు తెలియజేయాలని సూచించారు. కాల్ సెంటర్ నంబర్ 1800 4256 468లో ఫిర్యాదులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని ఆయన వెల్లడించారు.



వర్షపు నీటితో నిండిపోయిన గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణ, గదులు



కొల్లిపర మండలం తూములూరులో నీట మునిగిన వరి పొలాలు

దాడి ఘటనపై కేసు నమోదు

తెనాలిరూరల్: దాడి ఘటనపై కేసు శనివారం నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా వేమూరు మండలం వరహాపురం గ్రామానికి చెందిన గుణదల మనోజ్ గుంటూరు వెళ్లే క్రమంలో తన బైక్‌కు జేఎంజే కళాశాల సమీపంలోని బంకులో పెట్రోలు కొట్టించుకునేందుకు ఆగాడు. అదే సమయంలో అంగలకుదురుకు చెందిన నలుకుర్తి సునీల్ మరి కొందరు వచ్చి అతనిపై దాడి చేశారు. సునీల్ భార్యకు మనోజ్ ఫోన్ చేశాడంటూ దాడికి పాల్పడ్డారు. గాయపడిన బాధితుడు చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

తెనాలిరూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో శనివారం ట్రైబల్స్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు రావూరి అంజలి కొలకలూరులోని నిరుపేద గిరిజనులకు బియ్యం పంపిణీ చేశారు. రైల్వే స్టేషన్, కాల్వకట్టలపై నివసిస్తున్న ఆయా కుటుంబాలకు తాత్కాలిక వసతి కోసం ప్లాస్టిక్ పట్టాలను అందించినట్లు ఆమె తెలియజేశారు. అలానే నందివెలుగు కాల్వ కట్టపై నిర్వాసితులైన 12 కుటుంబాలకు ఆహారపొట్లాలను అందిచారు. ఇంటూరి విజయ భాస్కర్, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన కౌన్సిల్ సమావేశం

- జీరో అవర్‌లో వార్డుల సమస్యల ప్రస్తావన
- వివరణ ఇచ్చిన మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అధికారులు




అజెండాను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్




జీరో అవర్‌లో వార్డుల్లోని సమస్యలను చెబుతున్న కౌన్సిలర్లు

తెనాలి రూరల్: తెనాలి పురపాలక సంఘ కౌన్సిల్ సాధారణ సమావేశం ప్రశాంతంగా జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన కౌన్సిల్ హాలులో శనివారం ఉదయం జరిగిన సమావేశంలో వివిధ వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. అజెండాలో పొందు పరిచిన అంశాల ఆమోదం నిమిత్తం సభ్యుల ముందుంచారు. తొలి అంశంగా గతంలో వాయిదా పడిన 2వ వార్డు కౌన్సిలర్ అన్నాబత్తుని పద్మజ కౌన్సిల్ సమావేశాలకు గత ఫిబ్రవరి నుంచి గైర్హాజరవడం గురించి చర్చించారు. దీనిపై 11వ వార్డు కౌన్సిలర్ కఠారి రత్న కుమారి స్పందిస్తూ.. మహిళలకు కొన్ని వ్యక్తిగత, అనారోగ్య కారణాలు ఉంటాయని, కాబట్టి కొంత మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ అంశాన్ని వాయిదా వేస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు. అనంతరం అజెండాలో 10 అంశాల వరకూ చర్చించారు. మిగిలనవి అభివృద్ధి పనులే కావడంతో మొత్తం ఆమోదం తెలిపి వార్డుల్లో సమస్యలు గురించి చర్చించే అవకాశం ఇవ్వాలని ఆరో వార్డు కౌన్సిలర్ కొరప్రాటి లక్ష్మి కోరారు. దీంతో అజెండాలో అన్ని అంశాలు ఆమోదిస్తూ జీరో అవర్ ఇస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు తమ తమ వార్డుల్లోని సమస్యలు ప్రస్తావించారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ, దోమల వ్యాప్తి, వీధి దీపాలు, దెబ్బతిన్న రహదారులు, బుర్రిపాలెం రోడ్డులో ఫెన్సింగ్ వంటి అంశాలు గురించి ప్రస్తావించారు.

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఇతర అధికారులు వాటికి వివరణ ఇచ్చారు. అనంతరం సమావేశాన్ని ముగించారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, అసిస్టెంట్ కమిషనర్ అనూష, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.





అత్తోట, సోమసుందరపాలెంలో పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్ , మాజీమంత్రి ఆలపాటి

రత్నాల చెరువులో ఇళ్లలోకి చేరిన నీరు



మంగళగిరి: నగరంలో శనివారం వర్షం ముంచెత్తగా శివారు కాలనీలలో ఇళ్లల్లోకి నీరు చేరింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగర కమిషనర్ అలీంబాషా ఆయా ప్రాంతాల్లో పర్యటించి స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడు తూ భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నగరంలోని దీన్‌దయాళ్ నగర్, చినకాకాని, రత్నాలచెరువు, టిడ్కో నివాసాలలో పర్యటించి ముంపు ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన తహసీల్దార్



కొలకలూరులో ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్: భారీ వర్షాల కారణంగా గ్రామాల్లో ఇళ్లలోకి నీరు చేరడం, చెరువులు నిండి ప్రమాదకర స్థితికి చేరుకున్న నేపథ్యంలో స్థానికుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మండల గ్రామాలను పరిశీలించారు. రూరల్ గ్రామం కొలకలూరులో వల్లూరి వారి చెరువు, వీరమ్మ చెరువు నిండి రోడ్లతో పాటు సమీపంలోని ఇళ్లలోకి నీరు చేరుతోందని గ్రామస్తులు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన కలెక్టర్ తహసిల్దార్‌ను అప్రమత్తం చేశారు. వెంటనే ఆయన గ్రామానికి వెళ్లి రెండు చెరువులను, అదేవిధంగా సమీపంలోని ఇళ్లలోకి నీరు చేరుతున్న విధానాన్ని పరిశీలించారు. శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా తహసీల్దార్‌ను గ్రామస్తులు కోరారు. చెరువుల సమస్య దీర్ఘకాలిక సమస్య కావడంతో త్వరలో ఓ గ్రామ సభ ద్వారా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన వారికి చెప్పారు. తాత్కాలికంగా ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బంది పడుతున్న రెండు కుటుంబాలను సమీపంలోని పాఠశాలకు తరలించి భోజన వసతిని కల్పించాల్సిందిగా వీఆర్‌ఓను ఆదేశించారు. అదేవిధంగా బుర్రిపాలెంలో ఐదు కుటుంబాలను, కోపల్లె గ్రామంలో మరో 15 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. ఆయన వెంట వీఆర్వోలు, వీఆర్ఏలు, ఎంపీటీసీ కాలిశెట్టి ఫణి కుమార్ పలువురు గ్రామస్తులు ఉన్నారు.

బస్సులను ఇతర అవసరాలకు వినియోగిస్తే చర్యలు



పాఠశాలల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్టీవో ప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు

తెనాలి రూరల్: విద్యా సంస్థల బస్సుల్ని ఇతర అవసరాలకు వినియోగిస్తే పర్మిట్లు రద్దు చేస్తామని తెనాలి ప్రాంతీయ రవాణా అధికారి కె. ప్రసాద్ స్పష్టం చేశారు. తెనాలి ఆర్టీవో పరిధిలోని విద్యా సంస్థల యాజమాన్యాలతో శనివారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బస్సులను పెళ్లిళ్ల ఇతర ప్రైవేటు కార్యక్రమాలకు వినియోగిస్తున్నారని, ఇకపై అటువంటి వాటిని గుర్తిస్తే వెంటనే పర్మిట్‌ను రద్దు చేస్తామని తెలిపారు. బస్సులు కచ్చితంగా 32 నిబంధనలు పాటిస్తూ ఫిట్‌నెస్ కలిగి ఉండాలని వెల్లడించారు. పాఠశాల బస్సు డ్రైవర్ 60 సంవత్సరాల వయో పరిమితి దాటిన వ్యక్తి అయితే అనర్హుడని పేర్కొన్నారు. డ్రైవర్ ప్రతి మూడు నెలలకొకసారి కచ్చితంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ఆ రికార్డులు భద్రపరచాలని వివరించారు. డ్రైవర్ల నియామకాన్ని ఆర్టీవో అధికారులకు తెలియజేయడంతో పాటు, ఐదేళ్ల అనుభవం, హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు. బస్సులో అత్యవసర ద్వారం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక పరికరం, బ్యాగులు భద్రపరచుకునే బాక్స్‌లు తప్పనిసరిగా ఉండాలని వెల్లడించారు. విద్యార్థులను తరలించే ఆటోల్లో ఆరుగురు మాత్రమే ఉండాలని తెలిపారు. సమావేశంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి. రాఘవరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదనరావు పాల్గొన్నారు.